క్లుప్తంగా

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీ అంజిరెడ్డిని సన్మానిస్తున్న జిన్నారం గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల గ్రామంలోని శివాలయం గుట్టపై విగ్రహ ధ్వంసం కేసుకు సంబంధించి 30 మంది జైలు నుంచి విడుదలయ్యారు. తమ కుటుంబాలకు అండగా నిలిచి బెయిల్ మంజూరుకు సహాయ సహకారాలు అందించినందుకు ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పటాన్‌చెరు ఎస్‌ఐగా శ్రీశైలం



సీఐ వినాయక్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌ఐ శ్రీశైలం

పటాన్‌చెరు టౌన్: సంగారెడ్డి వీఆర్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీశైలం పటాన్‌చెరు నూతన ఎస్‌ఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సీఐ వినాయక రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ శ్రీశైలం మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు న్యాయం జరిగే విధంగా చూస్తానని తెలిపారు.

టీచర్ల బడిబాట



బడిబాట కార్యక్రమంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి తమ పాఠశాల గురించి ప్రచారం చేశారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.కందర్ప మీడియాకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంగారాం, సీఆర్పీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బోరుమోటారు బిగింపు



బోరు మోటారును ప్రారంభిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలోని ఆరోవార్డులో ఏర్పడిన నీటి సమస్యను తీర్చేందుకు మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో ఇటీవల బోరు తవ్వించగా శుక్రవారం మోటరును బిగించారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ బాలయ్య, నాయకులు క్రిష్ణ, కార్యదర్శి నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు



భూమి పూజలో పాల్గొన్న గిరిధర్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామానికి మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మించేందుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, నాయకులు ఉజ్వల్‌రెడ్డి, ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్‌తో కలిసి భూమి పూజ చేశారు. త్వరితగతిన భవన నిర్మాణపు పనులు పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా.రమ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింగూరు పనుల్లో అవినీతి

- మంత్రి దామోదర అండతోనే...
- ఎడమ కాలువ పనులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్
- కాంట్రాక్టర్, ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



సింగూరు కాలువ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

జోగిపేట (అందోల్): సింగూరు కాలువ పనుల్లో భారీ అవినీతి జరుగుతోందని, మంత్రి దామోదర రాజనర్సింహ అండతోనే ఎడమకాలువ పనులు నాసిరకంగా నిర్వహిస్తున్నారని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆరోపించారు. సింగూరు ఎడమ కాలువ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ...తొమ్మిది నెలలుగా పనులు చేపడుతున్నామంటూ పంటలకు నీళ్లు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారన్నారు. లైనింగ్‌ను గట్టిపరిచే బెడ్ నాసిరకంగా వేశారని, బెడ్‌ను చేయితో లేపగా అమాంతంగా విరిగిపోయిందన్నారు. కాలువ నిర్మాణం పూర్తి చేయకుండానే బిల్లులు పొందారని, పనులను మాత్రం తూతూ మంత్రంగా చేసి రూ.150 కోట్లు కొట్టేసే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఈ పనులపై వెంటనే విచారణ చేపట్టి ఎంతమేరకు పనులు జరిగాయో, ఎన్ని నిధులు మంజూరు చేశారో పూర్తి వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి బినామీలతోనే పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ పనుల్లో అవినీతికి పాల్పడ్డ కాంట్రాక్టర్, ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. క్రాంతి కిరణ్ వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, పుల్కల్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, మాజీ సర్పంచ్ సిద్దయ్య, మహేశ్, మానిక్ రెడ్డి, శివకాంతం తదితరులు ఉన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ర్యాలీ చేస్తున్న అధికారులు

సంగారెడ్డి: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ప్రారంభించిన చంద్రశేఖర్ మాట్లాడుతూ... ప్రజలందరూ ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని కోరారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధిని అరికట్టగలమన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి, మలేరియా అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, వైద్యులు సంధ్యారాణి,శశాంక్ ,మెడికల్ కళాశాల విద్యార్థులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐకేపీ డీపీఎంలు

హత్నూర (సంగారెడ్డి): నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని ఐకేపీ డీపీఎంలు జయశ్రీ, కొమురయ్యలు స్పష్టం చేశారు. హత్నూర మండలం గుండ్లమాచునూర్,చందాపూర్,దౌల్తాబాద్, గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం వారు పరిశీలించారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చిన ధాన్యంతో పాటు పొలాల వద్ద ఉన్న ధాన్యాన్ని సైతం వెంటనే తూకం వేసి కొనుగోళ్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఎప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లను వేగవంతం చేసి రైస్ మిల్లులకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్ ఉన్నారు.

రూప్లతండాలో చికున్‌గున్యా లక్షణాలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న నాగమణి

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం వంగ్దల్ రూప్లతండాలో చికున్‌గున్యా లక్షణాలతో గిరిజనులు బాధపడుతున్నారు. రెండు నెలలుగా జ్వరం, నొప్పులతో ఇబ్బందులుపడుతున్నామని తండావాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కంగ్టి పీహెచ్‌సీ వైద్య అధికారి నాగమణి ఆధ్వర్యంలో శుక్రవారం రూప్లతండాలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటా తిరిగి బాధితుల వివరాలు సేకరించారు. 9 మంది జ్వరం, నొప్పులతో బాధపడుతున్నారని గుర్తించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌతమ్, ఏఎన్‌ఎం సుజాత పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ



ప్రదర్శనలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

నారాయణఖేడ్: పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ సాధ్యమని నిజాంపేట, తుర్కాపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు తరుణి, హరిణి తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఖేడ్‌లో సిబ్బందితో కలిసి ప్రదర్శన, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ వస్తుందన్నారు. మున్సిపల్ మెనేజరు వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, వైద్య, మున్సిపల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కల్యాణ మహోత్సవం ప్రారంభం

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో బీరప్ప- కామారతి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాలు 23వరకు జరుగుతాయని కురుమ సంఘ బాధ్యులు తెలిపారు. మొదటి రోజున మంద పోచమ్మ పండుగ నిర్వహించారు.

◆ చిరు వ్యాపారులకు న్యాయం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం బీరంగూడ చౌరస్తా వద్ద రోడ్డు పక్కన చిరు వ్యాపారుల బండ్లను అధికారులు తొలగించడం సరికాదని సీపీఎం నాయకుడు నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం రెవెన్యూ అధికారులకు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

◆ గణేశుడికి విశేష పూజలు

పటాన్‌చెరు టౌన్: గణేష్ గడ్డ దేవస్థానం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. సంకష్టహర చతుర్థి నేపథ్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సంతోష్ జోషి, చంద్రశేఖర్ స్వామి, జగదీష్ స్వామి మాట్లాడుతూ.. సంకష్టహర చతుర్థి సందర్భంగా స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం, హోమం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్ మాట్లాడుతూ.. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశామని, ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం సాగుతుందని చెప్పారు.

◆ సిగ్నల్ పోల్స్ ఏర్పాటు



జహీరాబాద్ టౌన్: పట్టణంలో రోడ్లు వెడల్పు చేయకపోవడంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా భవానీ మందిరం చౌరస్తాలో విపరీతమైన రద్దీ ఉంటోంది. చౌరస్తా నుంచి ఓ వైపు భవానీ మందిరం రోడ్డు, మరో వైపు హనుమాన్ మందిరం రోడ్డు వెళ్తోంది. ఇక్కడ రోడ్డు దాటడం చాలా కష్టంగా ఉంటోంది. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి జహీరాబాద్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. రోడ్డు మధ్యలో సిగ్నల్ పోల్స్ ఏర్పాటు చేసి కొంత వరకు సమస్య తొలగించారు.

గణితంలో లావణ్యకు పీహెచ్‌డీ

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని లావణ్య డాక్టరేట్‌కు అర్హత సాధించారు. లై బీజ గణిత పద్ధతి ఉపయోగించి వివిధ సమరూప బిందువు సమూహాలకు చెందిన అణువుల యొక్క అధిక నాణ్యత కంపన పౌనఃపున్యాలు అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ విజయ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ దయారా ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, వడక్‌పల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, అదేవిధంగా సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు, కిష్టారెడ్డిపేట్, ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, పటేల్‌గూడా సబ్ స్టేషన్ పరిధిలో రాఘవేంద్ర, నవ్య ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 3:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

హౌసింగ్ బోర్డులో నిలిచిన నీటి సరఫరా

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీకి మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. అయితే కొన్ని రోజుల నుంచి సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీ నీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్గాదేవి ఉత్సవాలు ప్రారంభం



బోనాలతో వస్తున్న మహిళలు

జహీరాబాద్: మొగుడంపల్లి మండలం జాడీ మల్కాపూర్‌లో దుర్గాదేవి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం గ్రామంలోని ఊరడమ్మ, భవానీ మాత ఆలయాలకు వందలాది మంది మహిళలు బోనాలతో తరలివచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగవాతావరణం నెలకొంది. వారం రోజుల పాటు జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయి.

జిల్లాలో భారీగా ధాన్యం కొనుగోలు

కలెక్టర్ వల్లూరు క్రాంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ మాధురి, అధికారులు

సంగారెడ్డి జోన్: జిల్లాలో మొత్తం 218 కొనుగోలు కేంద్రాల ద్వారా భారీగా ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ క్రాంతితోపాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ... కొనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో రూ.121.75 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ధాన్యం రవాణాకు లారీలు, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి, హమాలీల ఏర్పాట్లన్నీ సక్రమంగా ఉన్నాయని పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో పకడ్బందీ పర్యవేక్షణతో కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, వ్యవసాయ అధికారి శివప్రసాద్, సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్, డీఆర్‌డీఓ జ్యోతి తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తున్నానని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలో పార్కు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ. 50 లక్షలతో నిధులతో పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. పచ్చదనం, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు మహిపాల్‌రెడ్డి, వీరిశెట్టి, దేవేందర్ యాదవ్, అంజయ్య, వెంకట్‌రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీహెచ్‌సీలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, ఉప కమిషనర్ సురేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



హన్మంతరావుపేట్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: మండలంలోని హన్మంతరావుపేటలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామపెద్దలు, విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ బడి ప్రజలందరి ఆస్తి అని, ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సంజీవ్ కుమార్, ఉపాధ్యాయులు మల్లికార్జున్, శివాజీ, శైలజ, దేవీసింగ్, శివరాం, గ్రామపెద్దలు నారాయణ, చిరంజీవి, ఖలీల్, అజీజ్, అంగన్వాడీల టీచర్లు భారతి, ఇందిర పాల్గొన్నారు.

బడిబాటపై సమీక్ష

బడిబాట కార్యక్రమంపై మోర్గి స్కూల్ అధ్యాపకులు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ బడుల్లోనే అన్ని సదుపాయాలు ఉంటాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల పీజీ హెచ్‌ఎం. మన్మథకిషోర్, మోడల్ స్కూల్ అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



రాయికోడ్ : బడిబాటలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

రాయికోడ్(అందోల్): బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని రాయికోడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తల్లిదండ్రులను కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో బడిబాటలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, విద్యార్థుల విద్యాభ్యాసం కోసం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ కూడలిలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖైరత్ అలీ, ఉపాధ్యాయులు, ఆలయ కమిటీ చైర్మన్ సతీశ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు, గ్రామస్తులు స్వామి,రవి, రాజు ఉన్నారు.

100 మందికి నేత్ర వైద్య పరీక్షలు



శస్త్ర చికిత్సల కోసం బస్సులో బయలుదేరిన బాధితులు

నారాయణఖేడ్: స్థానిక సత్యసాయి ఆలయం ఆవరణలో సత్యసాయి సేవల సమితి ఆధ్వర్యంలో హైదరాబాదు నానక్ రాంగూడలోని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. వైద్యులు 100 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. 26 మందికి కాటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించడానికిగాను ఉచిత బస్సు, భోజన సదుపాయాలు కల్పించి వారిని ఆస్పత్రికి తీసుకువెళ్లామని సమితి జిల్లా కన్వీనర్ శంకరప్ప తెలిపారు.

విద్యార్థులు మా కాలేజీలో చేరండి

ఇంటింటి ప్రచారంలో సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): తమ కాలేజీలోనే చేరాలంటూ సాధారణంగా ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన సిబ్బంది ఇంటింటి ప్రచారం చేస్తుంటారు. అయితే సదాశివపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల్ని వారి కాలేజీలో చేర్చుకునేందు శుక్రవారం కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కళాశాలలో అందిస్తున్న సౌకర్యాలు, బోధనా విధానం, అధ్యాపకుల గురించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఈ కళాశాల సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ...కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు, ఆధునిక సౌకర్యాలు, ఉన్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్నామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. ఈ ఏడాది కొత్తగా బీబీఏ, బీకామ్(బీఎఫ్ఎస్ఐ) కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

అదనపు కలెక్టర్ మాధురి



శివంపేటలోని రైసుమిల్లును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

సంగారెడ్డి: రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కొనుగోలు కేంద్రాలను సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మాధురి పేర్కొన్నారు. ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా పరిశీలించి మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. శివంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, సాయి వీరభద్ర రైస్ మిల్లును శుక్రవారం అదనపు కలెక్టర్ మాధురి పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సదుపాయాలు, గన్నీ సంచుల లభ్యత, ధాన్యం నిల్వ పరిస్థితులను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె పీఏసీఎస్ సిబ్బందికి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. వచ్చిన లారీలను వెనువెంటనే ఖాళీచేసి కొనుగోలు కేంద్రాలకు పంపించాలని మిల్లర్లకు సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తడిసిన ధాన్యాన్ని కేంద్రాలనుంచి తరలించేవిధంగా వాహనాలు వెంటనే పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.